ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్, జూలై 22: సింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

పెంచికలపేట, జూలై 22: మండలంలోని బొంబాయిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్వాల్‌వాడలో శనివారం గోగు అంకుబాయి ఇల్లు భారీ వర్షానికి కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్సై కొమురయ్య ఇంటిని పరిశీలించి బాధితురాలిని పరామర్శించారు. తనవంతుగా రూ.2వేల నగదు, 40 కిలోల బియ్యం, బ్లాంకెట్‌లను అందించి మానవత్వం చాటుకున్నారు.


బాధితురాలికి సాయం చేస్తున్న ఎస్సై కొమురయ్య

ఆగస్టు 5వరకే దరఖాస్తుల స్వీకరణ

సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన

కష్టించి పనిచేసే రైతు కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. అనుకోని పరిస్థితుల్లో రైతు కాలం చేస్తే వారి కుటుంబం రోడ్డున పడకుండా రైతుబీమా అమలు చేస్తోంది. ఇందుకోసం రైతులు కేవలం దరఖాస్తు ఫారం నింపి వ్యవసాయాధికారులకు అందిస్తే చాలు. యేటా కట్టాల్సిన బీమా కిస్తులను ప్రభుత్వమే చెల్లిస్తుంది.



రైతు బీమాతో..ధీమా

వాంకిడి, జూలై 22: వ్యవసాయంపై ఆధారపడ్డ అన్నదాతల కుటుంబాలకు రైతుబీమా పథకం చేదోడుగా నిలుస్తుంది. పెద్ద దిక్కు అకస్మాత్తుగా ఎదైనా కారణంతో చనిపోతే ఆ కుటుంబమంతా రోడ్డన పడుతుంది. ఏమీ చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుంది. ఇలాంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. రూ.5లక్షల చొప్పున అందిస్తూ ఆసరగా నిలుస్తోంది. 18-59మధ్య వయస్సున్న పట్టాదారులు ఇందుకు అర్హులు. ప్రస్తుతం వ్యవసాయశాఖ ఇందులో కొత్తగా చేరేందుకు అవకాశం కల్పించింది. కర్షకుల నుంచి దరఖాస్తు స్వీకరణను ప్రారంభించిన వ్యవసాయ అధికారులు ఆగస్టు 5లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

రైతు కుటుంబాల్లో పెద్ద దిక్కుగా ఉండి అకాల మరణం సంభవించినప్పుడు వారి కుటుంబాలు రోడ్డన పడకుండా ఉండేందుకు వారికి చేదోడుగా నిలిచేందుకు ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేస్తోంది. 2018 ఆగస్టు 15 నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. నామినీకి రూ.5లక్షల బీమా వర్తించేలా నిర్ణయించారు. కర్షకుడు మృతి చెందినప్పుడు వ్యవసాయ అధికారులు వివరాలు సేకరించి నామినీ ఖాతాలో పరిహారం జమయ్యేలా చేస్తున్నారు. తొలి రెండు సంవత్సరాలు ఎప్పటికప్పుడు దరఖాస్తులు స్వీకరించారు. 2020 నుంచి ప్రతి వానాకాలంలో ఒకసారి మాత్రమే అర్హుల నుంచి సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. పథకంలో చేరిన రైతుపేరిట ప్రభుత్వం ఎల్ఐసీకి రూ. 3,457 ప్రీమియం చెల్లిస్తోంది.

నిబంధనలు ఇలా..

లబ్ధిదారుడి వయసు పక్కాగా తెలుసుకునేందుకు ఆధార్‌కార్డును ప్రామాణికం చేశారు. ఎన్ని చోట్ల భూమి ఉన్నా ఒక ఊరిలోనిది మాత్రమే బీమాకు అవకాశం ఉంటుంది. స్వయంగా బీమా ఫారాన్ని వివరాలతో నింపి సంతకం చేయాలి. పట్టాపాసుపుస్తకం లేదా తహసీల్ కార్యాలయం కాపీ, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్, ఖాతా వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలి. అధికారులు ఆయా వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌చేస్తారు. క్లస్టర్ కార్యాలయాల్లో ఏఈవోలు అందుబాటులో ఉండి దరకాస్తులు సేకరిస్తున్నారు. కొత్తగా పట్టాపుస్తకం పొందిన వారే దరఖాస్తు చేసుకోవచ్చు. 59ఏళ్లు నిండిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తారు. దరఖాస్తుల స్వీకరణ గడువు సమీపిస్తున్న రైతులు ముందుకు రాకపోతే మళ్లీ ఏడాది వరకు వేచి ఉండాల్సిందే.

సద్వినియోగం చేసుకోవాలి

మిలింద్‌కుమార్: వ్యవసాయ అధికారి, వాంకిడి



రైతు బీమా పథకంలో చేరడానికి అవకాశం వచ్చింది. వ్యవసాయశాఖ నుంచి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఆగస్టు5 వరకు మాత్రమే గడువు ఉంది. సకాలంలో దరఖాస్తులు చేసుకోకపోతే మళ్లీ ఏడాది వరకు వేచి ఉండాలి. రైతులు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అధ్యక్షా..

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- సమస్యల ప్రస్తావనకు సిద్ధమైన ఎమ్మెల్యేలు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 22: అసెంబ్లీ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీసమావేశాల్లో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజక వర్గాల ఎమ్మెల్యేలు వారు ప్రాతినిధ్యం వహించే సెగ్మెంట్‌లలో నెలకొన్న సమస్యలపై గళం విప్పనున్నారు. సమావేశాల్లో ప్రస్తావించే అంశాలు వారి మాటల్లో..

ప్రాజెక్టులు, మెడికల్ కళాశాలపై ప్రస్తావిస్తా..

- కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులైన వట్టివాగు, కుమరంభీం, చెలిమెల ప్రాజెక్టులు నిధులలేమితో సాగునీరు అందించలేని దుస్థితిలో ఉన్నాయి. కుమరంభీం ప్రాజెక్టు ఆనకట్ట 2022లో కుంగినా నేటికీప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాక మరమ్మతులకు నోచుకోలేదు. వట్టివాగు, చెలిమెల వాగు ప్రాజెక్టుల ప్రధానకాలువలు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో పూర్తిస్థాయి పంటలకు నీరు అందటంలేదు. ఈ అంశాలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా. అలాగే జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, మౌళిక వసతులపై ప్రస్తావిస్తా. డైట్‌కళాశాల ప్రారంభించినా సిబ్బందిని నియమించకపోవడం, ఆసిఫాబాద్‌లో కోఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాల అంశంపై చర్చిస్తాను. ఆసిఫాబాద్ మున్సిపాలిటీని ఉన్నతీకరించి రాజంపేటను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తామన్నప్పటికీ దానికి సంబంధించిన ఎలాంటి పరిపాలన, ఇతర అనుమతులు రాకపోవడం, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఎంఈవో కార్యాల యాల్లో పనిచేస్తున్న సీఆర్పీల సమస్యలపై సమావేశంలో ప్రస్తా విస్తాను. నియోజకవర్గంలోని అసంపూర్తిగా ఉన్న గుండి, అనార్‌పెల్లి వంతెన నిర్మాణాలకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వందృష్టికి తీసుకువెళ్తా.

పోడు భూముల సమస్యలపై చర్చిస్తా..

- డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్



కాగజ్‌నగర్: నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా మారిన పోడుభూముల అంశం, పోడు భూముల కేసుల ఎత్తివేత విషయంలో ప్రస్తావిస్తా. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా. ఇటీవల సిర్పూర్ నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం విషయంపై, తెగిపోయిన బురదగూడెం రిజర్వాయర్ కాలువ మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని సమావేశాల్లో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా. ఆశా వర్కర్ల గౌరవ వేతనం, మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లుల చెల్లింపు అంశాలను ప్రస్తావిస్తా. అలాగే నియోజకవర్గంలోని ప్రధానసమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యే విధంగా కృషిచేస్తా.

ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి: ఎస్పీ



ఎస్పీని సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం

ఆసిఫాబాద్, జూలై 22: జిల్లాలోని ప్రజలు నిర్భయంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ఎస్సై, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, గంజాయి విక్రయం జరుగుతున్నా లేదా రవాణా చేస్తున్నా వెంటనే పోలీసు అధికారులకు లేదా 8712670505కి సమాచారం అందించాలన్నారు.

ఎస్పీని కలిసిన ఆర్టీసీ డీఎం..

ఎస్పీ శ్రీనివాసరావును సోమవారం ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూల మొక్కను అందజేసి సన్మానించారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పోలీసు సిబ్బందిని నియమించాలని, బస్టాండులో గుర్తు తెలియని వ్యక్తులు పిక్ ప్యాకెటింగ్‌లకు పాల్పడుతున్నారని దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. సాను కూలంగా స్పందించిన ఎస్పీ త్వరలోనే కానిస్టేబుల్‌ను నియమిస్తామని పేర్కొన్నారు.


బెజ్జూరులో ప్రాణహిత బ్యాక్‌వాటర్‌లో మునిగిన పత్తిపంట


బెజ్జూరులో నాటుపడవలపై ప్రయాణం సాగిస్తున్న తలాయి గ్రామస్థులు


దహెగాంలో ప్రాణహిత బ్యాక్‌వాటర్‌లో నీట మునిగిన పత్తి చేనులో రైతులు

తగ్గని వరద ఉధృతి

- జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న ప్రాణహిత
- వరదలో మునిగిన పత్తిచేన్లు

బెజ్జూరు, జూలై 22: భారీ వర్షాల కారణంగా ఉప్పొంగిన ప్రాణహిత వరద ఉధృతి ఇంకా తగ్గలేదు. దీంతో మండలంలోని పలుగ్రామాలు జలదిగ్బందంలోనే మగ్గుతున్నాయి. భారీ వర్షాలకు ప్రాణహిత బ్యాక్‌వాటర్ పంట చేలల్లోకి భారీగా చేరింది. దీంతో తలాయి-పాపన్నపేట, సోమిని గ్రామాల మధ్య రోడ్డపై నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే విధంగా సుస్మీర్, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, నాగెపల్లి, బండలగూడ, పాతసోమిని, తిక్కపల్లి, తలాయి, భీమారం గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ గ్రామాలకు బాహ్యప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు నాటు పడవలపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

ప్రాణహిత నీటిలో మునిగిన పత్తిచేను

ప్రాణహితనది ఉప్పొంగి తీరప్రాంతాల్లో పత్తి పంటకు తీరనినష్టం సంభవించింది. రైతులు దిక్కుతో చనిస్థితిలో ఉన్నారు. ప్రాణహిత నది ఉప్పొంగడంతో బ్యాక్‌వాటర్ పంటచేలలోకి చేరింది. తీరప్రాంతాల్లో సుమారు 1500ఎకరాలకు పైగా పత్తిచేలు నీటముని గాయి. ప్రతి సంవత్సరం భారీవర్షాలు కురిసినప్పుడల్లా ప్రాణహితనది ఉగ్రరూపం దాల్చి బ్యాక్‌వాటర్ పూర్తిగా పంట చేలలోకి చేరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో పలుమార్లు పంటనష్టంపై అధికారులు సర్వే లు నిర్వహించి ప్రభుత్వానికి పంపించినా రైతులకు పరిహారం అందలేదు. ఈ ఏడాదైనా సాయం అందుతుందో లేదో చూడాలి.

దహెగాం: మండలంలోని రాంపూర్, మొట్లగూడ గ్రామాల్లో ప్రాణహితనదికి వరద పెరగడంతో బ్యాక్‌వాటర్‌లో పత్తి, కంది తదితర పంటలు నీటమునిగాయి. రెండు రోజులుగా పత్తి, కంది తదితర పంటలు నీటిలోనే ఉన్నాయి. బ్యాక్ వాటర్ పంట చేనుల్లో నిలిచి ఉండడంతో పంటలు ఏమవుతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో కల్వాడ సమీపంలోని పాల్వాయి పురుషోత్తమరావు ప్రాజెక్టు జలకళను సంతరించుకుని మత్తడి పారుతోంది.

పంటలను పరిశీలించిన ఏఈవో

దహెగాం మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దుబ్బగూడ, తిర్పూర్‌గాం, దిగిడ, మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి గ్రామాల్లో నీట మునిగిన పంటలను సోమవారం ఏఈవో దేవ్‌పాల పరిశీలించారు. దాదాపు 150ఎకరాల్లో పటనష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు.

ప్రాణహితకు జలకళ..

చింతలమానేపల్లి: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోగల గూడెం ప్రాణహితనది పరవళ్లు తొక్కుతూ జలకళను సంతరించుకుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువనీరు దిగువకు వస్తుండడంతో ప్రాణహిత వద్ద నిర్మించిన వంతెన వద్ద చూపరులను ఆకట్టుకునేలా వర్షపునీరు ఉప్పొంగి ప్రవవహిస్తోంది. దీంతో ఇటు తెలంగాణ, అటు మహా రాష్ట్ర ప్రాంతాల ప్రజలు అక్కడి సన్నివేశాలను చూసేందుకు తరలివస్తున్నారు.

ఉధృతంగా పెన్‌గంగా..

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని పెన్‌గంగా నదితో పాటు వాగులు, వంకల నీటి ప్రవాహాలను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ సోమవారం పరిశీ లించారు. మండల సరిహద్దులోని పెన్‌గంగా పోడ్సా వంతెనను పరిశీలించారు. అలాగే పారిగాం వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు, మత్స్య కారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యదర్శులు వారివెంట కార్యదర్శి సందీప్, కారోబార్ దిలీప్, వీఆర్ఏ దౌలత్ పాల్గొన్నారు.



సిర్పూర్(టి) సరిహద్దులో పెన్‌గంగా ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు


చింతలమానేపల్లి గూడెం వంతెనను ఆనుకుని ప్రవహిస్తున్న ప్రాణహిత నది



సింగరేణి సంస్థ ప్రగతికి పాటుపడాలి

మందమర్రిటౌన్, జూలై 22 : సింగరేణిసంస్థ ప్రగతేధ్యేయంగా నూతనంగా ఉద్యోగంలో చేరుతున్న యువతీ, యువకులు పాటుపడాలని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కింద ఉద్యోగంలో చేరుతున్న 11మందికి సోమవారం జీఎం కార్యాలయంలో నియామక పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కారుణ్య నియామకాల ద్వారా మందమర్రి ఏరియాలో 1862మంది ఉద్యోగాల్లో చేరారన్నారు. ఇష్టపడి పనిచేస్తే ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశాలుంటాయని తెలిపారు. సింగరేణిలో విద్యార్హతలుంటే జీఎం, డైరెక్టర్‌స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు ఫైడీశ్వర్, పీఎం శ్యాంసుందర్, డీవైపీఎం సత్యబోస్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీని విమర్శించడం తగదు'

శ్రీరాంపూర్, జూలై 22: కాంగ్రెస్‌పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను దోచుకుంటోందని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు విమర్శించడం మానుకోవాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు హితవు పలికారు. శ్రీరాంపూర్‌లో సోమవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపెనీస్ యాక్ట్-2013 ప్రకారం సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ పథకంలో భాగంగా సివిల్స్ అభ్యర్థులకు రూ.4కోట్ల రూపాయలు ఇవ్వడం సరైందేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోప ణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, జాతీయసమితి సభ్యుడు సీహెచ్ భీంరావు, కేంద్ర ఉప ప్రధానకార్యదర్శి గరిగె స్వామి, రావుల అనిల్, మద్దెల వెంకటేష్, నరసింహస్వామి, తిరుపతి, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా ప్రకటించాలి: టీబీజీకేఎస్

శ్రీరాంపూర్, జూలై 22: గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి వెంటనే కార్మికులకు 35శాతం వాటా ఇవ్వాలని టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శి కె సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసినెలలు గడుస్తున్నా ఇంకావాటాను ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. అంతేకాకుండా 70మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకున్నందుకు ఒక్కో కార్మికుడికి బంగారు నాణెం అందించాలని కోరారు.

అక్టోబర్ నాటికి అడ ప్రాజెక్టుకు మరమ్మతులు: కలెక్టర్



కుమరం భీం ప్రాజెక్టును సందర్శిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 22: రానున్న అక్టోబర్ నాటికి కుమరం భీం(అడ)ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. నాలుగు రోజుల నుంచి అధిక వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో సోమవారం అదనపు కలెక్టర్ దీపక్‌తి వారితో కలిసి అడ ప్రాజెక్టు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న అక్టోబర్ నాటికి ప్రాజెక్టుకు మరమ్మతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పరిస్థితి సమీక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీవర్షాల నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపుప్రాంతాల ప్రజల సంరక్షణార్థం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీనెంబర్ 63046 86505, 08733-279033 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే ఫోన్‌చేసి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ గుణవంతరావు, డీఈ దామోదర్, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆసిఫాబాద్: ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం హడ్కోకాలనీకి చెందిన పద్మావతి తనకు వితంతు పెన్షన్ ఇప్పించాలని, కాగజ్‌నగర్‌మండలం బారె గూడకు చెందిన విజయనిర్మల భారీ వర్షాల వల్ల చెరువు కట్ట తెగి గ్రామశివారులోని ఎనిమిది ఎకరాల్లో పత్తిపంటపై ఇసుక మేటలు వేయడంతో రూ.3లక్షల నష్టం వాటిల్లిందని పరిహారం ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం తుంపల్లికి చెందిన సంపత్ వట్టివాగు ప్రాజెక్టులో తన పట్టాభూమి పోయిందని బదులుగా తుంపల్లి శివారులో భూమి చూపించారని, పట్టా మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం కిష్టాపూర్‌కు చెందిన శంకర్ దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన షేక్‌అబుత్సల తన దివ్యాంగ పత్రంలో పేరు తప్పుగా నమోదు అయిందని సవరించాలని అర్జీ పెట్టుకున్నారు. సిర్పూర్(టి)కి చెందిన జమీల్‌హుస్సేన్ తనకు లక్ష్మీపూర్ శివారులో భూమి ఉందని విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని, పెంచికలపేట మండలం చెడ్వాయికి చెందిన రాజన్న పట్టాభూమికి కొలతలు నిర్వహించి హద్దులు చూపించాలని అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.













ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

భీమారం, జూలై 22: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎన్ఆర్ ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2023-24 ఆర్థిక సంవత్సరం సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావే దిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆర్థికసంవత్సరంలో రూ.2.79కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల య్యాయని, పనుల్లో అవకతకవలు జరగగా రూ.11,279 రూపాయలు మండలంలోని వివిధ గ్రామాల నుంచి రికవరీ చేశామని డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో రాధ తెలిపారు.

రానున్న రోజుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పనులను చేయాలని సూచించారు. ఎంపీవో సతీష్‌రెడ్డి, ఏపీవో జీనత్, ఆడిట్ సిబ్బంది కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 22: ప్రజావాణిలో అర్జీదా రులు అందించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా కృషి చేస్తా మని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరే ట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరి కృష్ణతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నస్పూర్, చెన్నూరు, భీమారం, తాండూర్, బెల్లంపల్లి ప్రాం తాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నాగవర్మ

దండేపల్లి,జూలై 22: లింగాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ముత్యం నాగవర్మ సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన అనిలా వివిధ ఆరోపణలపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. ఆమె స్థానంలో ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాగవర్మకు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

కాసిపేట, జూలై 22 : దండేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సి పాల్ అనీలా సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్‌మాదిగ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలోని కొందరు ఉపాధ్యా యులు కుట్ర పూరితంగా కక్ష గట్టి అవినీతి ఆరోపణలు చేస్తూ ఆమెను తొలగించేందుకు కుట్రలు చేశారన్నారు. సస్పెన్షన్ ఎత్తివేయకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు.

మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలి

కాసిపేట, జూలై 22: కేజీబీవీ ఉపాధ్యాయులకు మిని మం టైంస్కేల్ వర్తింపజేయాలని టీజీపీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి అన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేప ట్టారు. ఆమె మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో పది సం వత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉపాధ్యాయులను రెగ్యు లర్ చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు రమణారెడ్డి, కృష్ణగోపాల్, రజిత, దీపమాల పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాల పట్టివేత

చెన్నూరు, జూలై 22: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని మూత శ్రీనివాస్, కొండమీది సుధాకర్ ఇండ్లలో గుట్కా ప్యాకెట్లు ఉన్నాయనే సమాచారం మేరకు సోదాలు చేయగా రూ.60 వేల విలువ గల గుట్కా ప్యాకెట్లు లభ్యమ య్యాన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంతర పంటలపై అవగాహన

కాసిపేట, జూలై 22 : ముత్యంపల్లిలో సోమవారం అంతర పంటల సాగు విధానంపై మండల వ్యవసాయా ధికారి వందన రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ప్రతి పంటలో అంతర పంటలను సాగు చేస్తే లబ్ధి పొందుతారన్నారు. పత్తి పంట సాగు చేసుకుంటున్న రైతులు సాళ్ల మధ్యన కూరగాయలు విత్తు కుంటే పంట బలంగా ఉంటుందన్నారు. రుణమాఫీ విషయంలో సందేహాలుంటే రైతువేదికలో సంప్రదించాలన్నారు. రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.







కాగజ్‌నగర్‌లో ఐపీ పెట్టిన వ్యాపారి

● రూ.12కోట్ల మేర ఎగనామం?

● లబోదిబోమంటున్న 37మంది బాధితులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, జూలై 22: అధిక వడ్డీ ఆశ చూపి వడ్డీ వ్యాపారులు జిల్లాలో పెట్రేగి పోతున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ డివి జన్ పరిధిలో ఇదివరకే కొంతమంది వ్యాపారులు ఐపీ పెట్టుకోగా, తాజాగా మరోవ్యక్తి సుమారు రూ.12 కోట్ల మేర ప్రజలకు కుచ్చుటోపీ పెట్టినట్టు తెలుస్తోంది. సదరువ్యక్తి ఓ బ్యాంకులోని సీఎస్పీ సెంటర్‌ను నడిపిస్తున్నట్టు తెలిసింది. సదరు వ్యక్తి అధిక వడ్డీ ఆశచూపి బాధి తుల నుంచి ఒక్కొక్కరి వద్ద నుంచి లక్ష నుంచి పదిలక్షల వరకు సమీ కరించాడు. వడ్డీ వస్తున్న ఆశతో ఆ వ్యక్తిని నమ్ముకున్న 37మందికి కుచ్చుటోపీ పెట్టి సుమారు రూ.10నుంచి రూ.12 కోట్ల మేరకు ఆర్జినట్టు ప్రచారం జరుగుతోంది. సదరు వ్యక్తుల వద్ద తీసుకున్న సొ మ్మును తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్న క్రమంలో చాకచక్యంగా వారి నుంచి తప్పించుకునేందుకు సీఎస్పీ నిర్వాహకుడు ఇటీవల కోర్టును ఆశ్రయించి ఐపీ పెట్టాడు. దీంతో 37మందికి కోర్టు నుంచి నోటీసులు జారీ అయినట్టు సమాచారం. ఖంగుతున్న బాధితులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. తమతో ఎంతో నమ్మకంగా ఉండి తాము పైసా పైసా కూడబెట్టిన డబ్బంతా పోయిందని బాధితులు లబోదిబో మంటు న్నారు. ఈ విషయమై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరయ్య తెలిపారు.

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

కాగజ్‌నగర్, జూలై 22: సిర్పూరు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయ టం సరికాదని బీఆర్ఎస్ సిర్పూరు నియోజ కవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానికంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాగజ్‌నగర్ అంకుసాపూర్ సమీపంలో నిర్మిస్తున్న ఇథ నాల్ ఫ్యాక్టరీ విషయంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎన్‌టీసీపీ అనుమతి లేకుండా ఫ్యాక్టరీ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించినట్టు వివరించారు. కాగా ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాక్యలు చేయటం సహించరాని విషయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోయిన్, అం బాల ఓదెలు, నక్క మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

సిర్పూర్(టి): సోమవారంమండలకేంద్రంలోని రైతువేదికలో ఏఈవో కవిత లక్షలోపురుణాలు మాఫీకాని రైతులనుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

-ప్రభుత్వఉద్యోగులకు బదిలీలు తప్పవనిఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీకావడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మానిం చారు.

కౌటాల: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తామని ఏవో రాజేష్ తెలిపారు. రైతులకు శాస్త్రవేత్తలు నేరుగా సందేహాలు, సమాధానాలు ఇస్తారన్నారు..

-సిర్పూర్(టి) మండలం కొమ్ముగూడకు చెందిన మౌల్కర్ రాజేంద్ర ప్రసాద్ తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు కౌటాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా సీఈఆర్ఐ టెక్నాలజీతో ఫోన్‌ను కను క్కొని సోమవారం ఎస్సై బాధితుడికి అందజేశారు.

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి వాగువద్ద సోమవారం అధికా రులు ముళ్లకంచె ఏర్పాటుచేశారు. వర్షాలకు అనార్‌పల్లివాగు ఉప్పొంగ డంతో వాగు అవతలివైపు ఉన్న కరంజివాడ, లక్మాపూర్ గ్రామాలకు ప్రజలు వెళ్లకుండాముళ్లకంచె ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పెంచికలపేట: మండలవ్యాప్తంగా సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. పలుగ్రామాల్లో అంతర్గతరోడ్లు బురదమయంగా మారాయి.

-మండలంలోని కొండపల్లి గ్రామంలో సోమవారం ఏఈవో శ్రీవిద్య నూతన రైతు బీమా దరఖాస్తులను స్వీకరించారు.

జాతీయ పతాక ఆమోద దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మంచిర్యాల అర్బన్, జూలై 22: లయన్స్‌క్లబ్ ఇంటర్నేనల్ డిస్ట్రిక్ట్ 320జి ఆధ్వర్యంలో సోమవారం ఐబీ చౌరస్తా నుంచి బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు జాతీయ పతాక ఆమోద దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. 77 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీని కొనసాగించారు. గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వాలేటి శ్రీనివాస్, ఆనంద్, వి.మధుసూదన్‌రెడ్డి, ఉదారి చంద్రమోహన్, సెవెన్‌హిల్స్, రివిలేషన్, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో కూలిన స్లాబ్ పైపెచ్చులు



వైద్యాధికారి టేబుల్‌పై కూడిన స్లాబ్ పైపెచ్చులు, పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

కాసిపేట, జూలై 22: కురుస్తున్న వర్షాలకు కాసిపేటలోని పశువైద్యశాల స్లాబ్ పై పెచ్చులు ఊడి పశువైద్యాధికారి టేబుల్‌పై పడ్డాయి. సోమవారం ఉదయం స్లాబ్ పెచ్చులూడి పడిన సమయంలో పశువైద్యాధికారి తిరుపతి బయట వైద్యం చేస్తుండడంతో ప్రమాదం తప్పింది. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని మార్చాలని గతంలోనే ప్రభుత్వానికి విన్నవించామని అయినా పట్టించుకోలేని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా పశువైద్యాధికారి శంకర్ ఆసుపత్రిని సందర్శించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కొత్త భవనం నిర్మాణానికి నివేదికలను ప్రభుత్వానికి పంపించామన్నారు.

మధుసూదన్‌రెడ్డికి అవార్డు



మంచిర్యాల అర్బన్, జూలై 22: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి సీనియర్ లయన్ మెంబర్ వి.మధుసూదన్‌రెడ్డి బెస్ట్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్‌గా అవార్డు అందుకున్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ హనుమాండ్ల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. వెంకటేశ్వర్‌రావు, సింహరాజు కోదండరాం, బద్రేశం, సుగుణాకర్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మందమర్రిరూరల్, జూలై 22: పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో ముత్యం తిరుపతి సోమవారం తెలిపారు. పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో సండ్రోన్‌పల్లి రైతువేదికలో అందజేయాలని సూచించారు. ఈ నెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కలవరపెడుతున్న సిజేరియన్లు



జిల్లాలో సిజేరియన్ ఆపరేషన్లు అధికంగా జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలు చేయాలని ప్రభుత్వం పేర్కొంటున్నా అటు వైద్యులు, ఇటు గర్భిణులు సిజేరియన్ల వైపు మొగ్గుచూపుతున్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ధనార్జనే ధ్యేయంగా ఆపరేషన్లు చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాల్సి ఉండగా కొందరు మంచి ముహూర్తంలో పుట్టాలనే ఆపరేషన్లు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రిస్క్ ఉన్న వారికే ఆపరేషన్ చేస్తున్నారు.



- జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్ ఆపరేషన్‌లు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రసవాలు
- పెరుగుతున్న ముహూర్తపు ప్రసవాలు
- వంద శాతం సిజేరియన్‌లు చేసిన 12 ప్రైవేటు ఆసుపత్రులకు నోటీసులు
- రాష్ట్ర ఆరోగ్య శాఖ హెచ్చరించినా మారని వైనం

బెల్లంపల్లి, జూలై 22: జిల్లాలో సిజేరియన్ ఆపరేషన్లు అధికంగా జరుగుతున్నాయి. పురుటి నొప్పులతో ఆసుపత్రికి వెళితే సాధారణ ప్రసవం చేయడం లేదు. సాధారణ ప్రసవం చేసే అవకాశం ఉన్నా ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్‌లు చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గిపోతుంది. కొందరు కుటుంబ సభ్యులు తిథి, నక్షత్రం చూసుకుని ఆ సమయంలో పిల్లలు పుడితే మంచిదని భావిస్తూ ఆపరేషన్ చేయాలని వైద్యులకు సూచిస్తున్నారు. జిల్లాలో వంద శాతం సిజేరియన్‌లు చేస్తున్న 12 ప్రైవేట్ ఆసుపత్రులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నోటీసులు జారీ చేసింది.

ప్రైవేటు ఆసుపత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్‌లు...

జిల్లాలో ప్రసవాలకు సంబంధించిన ప్రైవేటు ఆసుపత్రులు 41 ఉన్నాయి. జిల్లాలో 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో 4200 ప్రసవాలు జరగగా ఇందులో 3742 సిజేరియన్ ఆపరేషన్‌లు నిర్వహించారు. కేవలం 650 మాత్రమే నార్మల్ డెలివరీలు చేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో 5394 ప్రసవాలు జరగగా ఇందులో 2776 సిజేరియన్ ఆపరేషన్‌లు జరగగా 2436 నార్మల్ డెలివరీలు జరిగాయి.

రిస్క్, హైరిస్క్ ఉన్న సంద ర్భాల్లో మాత్రమే ఆపరేషన్ ద్వారా ప్రసవాలు చేయా లనే నిబంధనలు ఉన్నప్పటికీ ఆసుపత్రుల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏదో ఒక సాకుతో సిజేరియన్ చేసి రూ. 50 వేల నుంచి 60 వేల వరకు వసూలు చేస్తున్నారు. గర్భం దాల్చిన సమయం నుంచి ఒక్కో క్కరి వద్ద ప్రతీ నెల పరీక్షలు, వైద్యం, మందుల పేరుతో రూ.5 వేల నుంచి 6 వేల వరకు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా కొందరు ఆసుపత్రుల వైద్యులు సాధారణ ప్రసవాలు చేస్తే తక్కువ ఫీజుకే పరిమితం అవుతారని సిజేరియన్‌లను ప్రోత్సహిస్తు న్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

: అనిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

రిస్క్, హైరిస్క్ ఉన్న సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేయాలి. డబ్బుల కోసం సాధారణ ప్రసవాలను కూడా సిజేరియన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి సారించాం. వంద శాతం సిజేరియన్‌లు చేసిన ఆసుపత్రులకు నోటీసులు అందించాం. ప్రైవేటు సుపత్రుల వైద్యులను పిలిపించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించాం. ఎవరైనా వైద్యులు ముహూర్తపు ప్రసవాలను ప్రోత్సహిస్తే సహించేది లేదు. కుటుంబీకుల్లో సైతం మార్పు రావాలి.

ముహూర్తపు ప్రసవాలు అధికం

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధికంగా సిజేరియన్లు కావడానికి ముహూర్తం ప్రసవాలే కారణమని తెలుస్తోంది. నెలలు నిండి కొన్ని సమయాల్లో రిస్క్ ఉన్న సమయంలోనే సిజేరియన్ చేయాల్సి ఉంటుంది. కాని కొందరు కుటుంబీకులు తిథి, నక్షత్రం చూసుకుని ఆ సమయంలో పిల్లలు పుడితే బాగుంటుందని, నిర్ణయించిన సమయంలో ఆపరేషన్ చేయాలని వైద్యులకు సూచిస్తున్నారు. దీనికి వైద్యులు సైతం ఎక్కువ డబ్బులు వస్తాయని సిజేరియన్ ఆపరేషన్ చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్‌లు పెరగడానికి ఇది కూడా కారణంగా కనిపిస్తోంది. ఇటీవల ప్రైవేటు ఆసుపత్రుల్లో వందకు వంద శాతం సిజేరియన్‌లు చేసిన 12 ఆసుపత్రులకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు, తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నస్పూర్, జూలై 22: సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. అంతకు ముందుగా చౌరస్తా నుంచి ఊరేగింపుగా కలెక్టరేట్‌కు వచ్చారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బైఠాయించారు. నాయకులు మాట్లాడుతూ కనీసం వేతనం 18వేలు, అలవెన్స్‌లను ప్రకటించాలన్నారు. ఆశాలకు ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పరీక్షలను ఉపసంహరించుకోవాలన్నారు. సెలవులు లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకు సేవలు చేయాల్సి వస్తోందన్నారు. ధర్నాలో శోభ, రంజిత్ కుమార్, పద్మ, సువర్ణ, సుజాత, కవిత, అరుంధతి, విజయలక్ష్మి, సునిత, భాగ్య పాల్గొన్నారు.

హాజీపూర్: బీసీ కుల గణన చేపట్టాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీ కుల గణన చేపడుతామని, స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్‌లు 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. వెంటనే బీసీ కుల గణన చేపట్టి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు. చిందం రమేష్, సత్యం, కృష్ణమూర్తి, శంకర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి(తాండూర్): ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని నేతకాని సంఘం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకుస్థలం కేటాయించాలన్నారు.

భీమారం: ఆరేపల్లి ఎర్ర చెరువు నుంచి ఆరేపల్లి, మద్దికల్ గ్రామాల రైతులు కాలువలు ఏర్పాటు చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు అందజేశారు. కాలువల ద్వారా నీరందిస్తే పంటలకు ఇబ్బంది ఉండదని తెలిపారు.

అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్‌లో బోనాల వేడుక



బోనాల వేడుకల్లో నరేందర్‌రెడ్డి, విద్యార్థులు

ఏసీసీ, జూలై 22: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్‌లో బోనాల వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి మహంకాళి మాతకు, దుర్గాదేవి చిత్రపటాలకు, బోనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు దుర్గామాత, పోతరాజుల వేషధారణలతో బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసి అలరించారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు దేశానికే ఆదర్శమన్నారు. పండగల ద్వారా విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరియడంతోపాటు ఐకమత్యం పెంపొందుతుందన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం

భీమారం, జూలై 22 : బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో రాథోడ్ రాధ, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్, ఎంపీవో శ్రీపతి బాపురావులను సోమవారం కార్యాలయ సిబ్బంది సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళాశక్తి పథకం యూనిట్లను వెంటనే ప్రారంభించేలా చర్యలు


● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 22: మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపట్టిన మహిళాశక్తి పథకంలో పొందుపరిచిన యూనిట్లను గుర్తించి వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి సహాయప్రాజెక్టు మేనేజర్లు, స్త్రీనిధి అధికారులు, బ్యాంకు అధికారులతో మహిళాశక్తి పథకం యూనిట్ల నిర్వహణకు అర్హత కలిగిన మహిళా సంఘాల గుర్తింపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళాశక్తి పథకంలో డెయిరీ యూనిట్లు, కోళ్లు, చేపల పెంపకం, ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాట్ల నిర్వహణకు అర్హతకలిగిన మహిళాసంఘాలను గుర్తించాలన్నారు. సమావేశాలు నిర్వహించి యూనిట్ల ద్వారా వచ్చే ఆదాయాలపై సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మండలాల వారీగా కేటాయించిన లక్ష్యాల ప్రకారం సంఘాలను గుర్తించి వెంటనే యూనిట్లు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎం, ఏపీఎంలు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలి



డిప్యూటీ తహసీల్దార్ రఘునాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, జూలై 22: మండలంలోని వంజీరి గ్రామ అండర్ బ్రిడ్జి సమస్యను వెంటనే పరిష్కరించాలని సోమవారం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ వర్షాలకు అండర్‌బ్రిడ్జిలో నీరు చేరిందన్నారు. తాత్కాలిక గేటు కూడా మూసివేయటంతో గ్రామానికి రహదారిలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రఘునాథ్‌కు అందజేశారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు కోకన్వీనర్ మోయినోద్దీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ సీపీ విద్యావతి, సీపీ రాజ్‌కుమార్, అంబాల ఓదేలు, కన్నయ్య, సలీం, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వం నమోదు

జైనూర్, జూలై 22: మండలకేంద్రంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, జామ్ని ఎంపీయూపీఎస్, కేజీబీవీ పోచంలొద్దిలలో సోమవారం పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి అడెప్రకాష్‌అధ్వర్యంలో సభ్యత్వనమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ శాఖ మండల అధ్యక్షుడు భూమన్న, కార్యదర్శి ఆత్రం దత్తు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు: కలెక్టర్

ఆసిఫాబాద్, జూలై 22: ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి జిల్లాలోని మిషన్‌భగీరథ ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మిషన్ భగీరథఫిల్టర్‌బెడ్ ద్వారా రోజుకు 115మిలియన్‌లీటర్ల తాగునీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉందన్నారు. వర్షాకాలం అయినందున ఎలాంటి ఇబ్బందులు లేకుండా శుద్ధమైన తాగునీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 7మండలాల్లో 900 గ్రామాలకు ఈ ఫిల్టర్‌బెడ్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. అనంతరం అడ అర్బన్ పార్కు చిల్డ్రన్స్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ఐటీడీఏ నిధులను వినియోగించుకోవాలని, పనులను త్వరతగతిన చేపట్టి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, రిజిస్టర్‌లు పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అవసరమైన మందుల నిలువ చేసుకోవాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస రావు, డీఈ ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వనమహోత్సవం లక్ష్యాలను నెలాఖరులోగా పూర్తిచేయాలి

వనమహోత్సవం జిల్లాలో ఆయాశాఖల వారిగా కేటాయించిన లక్ష్యాలను మాసాంతంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో మొక్కలు నాటే లక్ష్యాల సాధనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా జిల్లాకు 53లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉంద న్నారు. ఇప్పటివరకు 45శాతం పూర్తి చేశామని తెలిపారు. ఈక్రమంలో ఆయాశాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను మాసాంతంలోగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రైతు వేదికలు, వసతిగృహాలు, ప్రాథమికఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, గురుకులాలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలునాటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా, దోమలవృద్ధిని అరిట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

● జేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, జూలై 22: బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో చేసిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో బీసీ డిక్లరేషన్ హామీ చేస్తామని చెప్పిందన్నారు. కానీ ఇంత వరకు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. అలాగే గొల్లకుర్మలకు అధికారంలోకి రాగానే వంద రోజుల్లోనే రెండవదశ గొర్రెల పంపిణీ చేస్తామని చెప్పిన సీఎం మాటను ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజకసామాజికవర్గాలకు ఇచ్చిన హామీలన్నీ కూడా వెంటనే నేర్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడు వెంకటేష్, శ్రీ దేవి, రమేష్, సిందం శ్రీనివాస్, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో..

దహెగాం/పెంచికలపేట/చింతలమానే పల్లి/లింగాపూర్/ సిర్పూర్(యు)/ దహెగాం: కాంగ్రెస్‌ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వందరోజుల్లో నెరవేరుస్తామని ఆరునెలలు గడస్తున్నా నెరవేర్చలేదని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు సోమవారం మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. దహెగాంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సంజీవ్, ధనుం జయ్, మల్లేష్, సురేష్, పెంచికలపేటలో నాయకులు భుజంగరావు, శ్రీకాంత్, శోభన్, సంతోష్, చింతలమా నేపల్లిలో నాయకులు దోని శ్రీశైలం, తిరుపతిగౌడ్, మల్లయ్య, పురుషోత్తంచారి, రమేష్, భద్రేష్, భీమేష్, శ్రీధర్, రామన్న, శంకర్, మోహన్, మల్లేష్, లింగాపూర్‌లో బీసీ సంఘం నాయకులు పాండురంగ్, మారుతి, ఖండోజి, బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, సిర్పూర్(యు)లో నాయకులు ఇస్తారి మహారాజ్, దహెగాంలో నాయకులు వానుపటేల్, రాజేందర్ గౌడ్, సత్తయ్య, మిథున్ కవిరాజ్, మధుకర్, శ్రీనివాస్, భూమయ్య, నర్సింహా రావు, సంపత్, సంతర్, ప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడిగా బోగె ఉపేందర్



బోగె ఉపేందర్

రెబ్బెన, జూలై 22: జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా బోగె ఉపేందర్(ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి)ని ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకం పెట్టి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే భవిష్యత్తు కార్యచరణ చేసి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వైన్‌షాపులో చోరీ

● సుమారు రూ.5లక్షల విలువ గల మద్యం, రూ.15వేల నగదు మాయం

జైనూర్/సిర్పూర్(యు), జూలై 22: సిర్పూర్(యు) మండల పరిధిలో పిట్టగూడ సమీపంలో ఉన్న సాయివైన్స్ షాపులో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. ఈ సందర్భంగా వైన్‌షాపులో నుంచి దొంగలు దాదాపు రూ.5లక్షల విలువ గల మద్యం, రూ.15 వేల నగదును దొంగలించుకెళ్లారు. షాపు యజమాని పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి'

వాంకిడి, జూలై 22: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ వినయ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలను సందర్శించి దోమల మందు పిచికారి, ఛైలార్యా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఎస్‌వో రైసాకాతూన్, ఏఎన్‌ఎం రుక్మిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

చింతలమానేపల్లి, జూలై 22: మండల కేంద్రంలోని గాయత్రి హైస్కూల్‌లో సోమవారం ఏఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో చింతలమానేపల్లి పోలీసులు విద్యార్థులకు కళాబృందంతో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్‌మోసాలు తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ సాదిక్ పాషా, ఎస్సై నరేష్, పోలీసులు, కళాకారులు పాల్గొన్నారు.

ఓ వైపు ఆహ్లాదం.. మరో వైపు ఆవేదన



పెంచికలపేటలో ఆహ్లాదాన్ని పంచుతున్న ప్రాణహిత, పెద్దవాగు సంగమ తీరం

పెంచికలపేట, జూలై 22: వర్షం అందరికీ ఆనందాన్ని పంచలేదు అనేందుకు ఉదాహరణ ఈ చిత్రాలు. ఎగువన, జిల్లావ్యాప్తంగా నాలుగురోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా పెద్దవాగు, ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాబందుల ఆవాసం పాలరాపుగుట్ట వద్ద పెద్దవాగు, ప్రాణహిత నది సంగమ ప్రాంతం ఆహ్లాదంగా ప్రకృతి ప్రేమికులను ఆహ్వానం పలుకుతుంటే.... మరోవైపు ప్రాణహిత వరద నీరు రైతులను కలవరపెడుతోంది. ప్రతి యేటా వరద ఉధృతికి వేల ఎకరాల్లో పంట నీట మునిగి రైతు కన్నీరుకు కారణమవుతోంది. వర్షాలు కురవాలని పూజలు చేసిన రైతులే ఇప్పుడు ఎడతెరిపి లేని వర్షానికి ఆందోళన చెందుతున్నారు.



పెంచికలపేటలో ప్రాణహిత వరదతో నీట మునిగిన పంటలు



కలవరపెడుతున్న సిజేరియన్లు
7లో..



కేంద్ర బడ్జెట్‌పై ఆశలు

- నేడు ప్రవేశపెట్టనున్న మంత్రి నిర్మలాసీతారామన్
- పాత రైళ్ళ పునరుద్ధరణ, కొత్త రైళ్ళ కేటాయింపులు ఉండేనా
- సింగరేణి కార్మికులకు ఐటీ రద్దు జరిగేనా...?

మంచిర్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో రైళ్ల సమస్య అధికంగా ఉండటం, దశాబ్దాల కాలంగా కొత్త రైళ్ళ కేటాయింపులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సింగరేణి కార్మికులకు ఇన్‌కంటాక్స్ రద్దు డిమాండ్ ఉంది. ఈ బడ్జెట్ లోనైనా ప్రజలు, వేతన జీవుల ఆశలు ఏ మేరకు ఫలిస్తాయనే ఉత్కంఠ నెలకొంది.





కొత్త రైళ్ల ఊసేది..?

సికింద్రాబాద్ సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కాజీపేట-వరంగల్ మార్గంలో దశాబ్దాల కాలంగా కొత్త రైళ్ల కేటాయింపులు లేవు. ఉన్నతాధికా రుల పర్యవేక్షణ లోపం కారణంగా కాగజ్‌నగర్ నుంచి బెల్లంపల్లి వరకు జరుగుతున్న మూడో రైల్వే మార్గం పనులు నత్తనకడన సాగుతున్నాయి. ఈ కారణంగా తరుచుగా రైళ్లను రద్దు చేస్తున్నారు. కొత్త రైళ్ల కేటాయింపులు లేకపోగా ఉన్న రైళ్లు రద్దవుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం రెగ్యులర్‌గా నడిచే భాగ్యనగర్ రైలుతో పాటు మధ్యాహ్నం ఇంటర్‌సిటీ, అనంతరం 3.30కి కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. పదేళ్ళుగా ఈ మార్గంలో కొత్త రైళ్లు కేటాయిం చలేదు. ఉదయం 8 గంటలకు కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు రైళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఉదయం 8 గంటలకు కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్, సాయం త్రం 5 గంటలకు కరీంనగర్ నుంచి కాగజ్‌నగర్‌కు రైలు సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

రైళ్లను పునరుద్ధరించాలి

మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి నిత్యం సుమారు 6వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో అత్యధికంగా హైద్రాబాద్‌కు ప్రయాణిస్తారు. ఈ మార్గంలో మూడు రైళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గతంలో కాజీపేట నుంచి అజ్నీ (బల్లార్ష) ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వెళ్లే సింగరేణి, కరీంనగర్‌కు వెళ్లే పుష్పుల్, కాజీపేటకు వెళ్లే రామగిరి రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. పాఠశాలలు, కళాశాలల చదువుల కోసం హైద్రాబాద్‌కు వెళ్లే విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. రైళ్లు అందుబాటులో లేకపోవడంతో బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక భారం భరించాల్సి వస్తోంది.



ఇన్‌కంటాక్స్ రద్దయ్యేనా...?

సింగరేణి కార్మికులకు ఇన్‌కంటాక్స్ చెల్లింపు సమస్యలకు పరిష్కారం చూపాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి. దశాబ్దాలుగా కార్మికులకు నాయకులు ఇన్‌కం టాక్స్ రద్దు చేస్తామనే హామీలు గుప్పిస్తున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల సమయంలో తప్పా... మిగతా సమయాల్లో కార్మికుల ఐటీ సమస్య ప్రస్తావన రాకపోవడంతో నాయకుల వైఖరి పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి కార్మికుల ఐటీ రద్దు కోసం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గళమెత్తాలనే డిమాండ్లు ఉన్నాయి.

సమస్యల పరిష్కానికి కృషి:ఎంపీ గడ్డం వంశీకృష్ణ



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పెద్దపల్లి లోకసభ నియోజకవర్గం పరిధిలోని రోడ్లకు అవసరమైన నిధులతోపాటు వంతెనల నిర్మాణం, కొత్త రైళ్లు, సూప ర్ ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ తదితర సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తా. సిర్పూర్ కాగజ్ నగర్ నుంచి హైద్రాబాద్‌కు 10 ఏళ్లుగా కొత్త రైలు రాలేదు. సూపర్‌ఫాస్టు రైలు మంజూరు కోసం ప్రభుత్వానికి విన్నవిస్తా. అలాగే నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వరకు వందేభారత్ రైలు మంజూరుకు కృషి చేస్తా.

పోటెత్తిన ప్రాణహిత

- కోటపల్లి, వేమనపల్లిలో నీట మునిగిన పత్తి పంటలు
- పరిశీలించిన వ్యవసాయ అధికారులు
- వందల ఎకరాల్లో పంట నష్టం





కోటపల్లి మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన పత్తి పంట, జనగామ సమీపంలో ప్రాణహిత వరదలో పంప్‌హౌజ్

మంచిర్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో బ్యాక్ వాటర్ కారణంగా కోటపల్లి, వేమనపల్లి, ఎర్రవాగు ఉధృతితో నెన్నెల మండలాల్లో వందల ఎకరాల్లో పత్తిపంట నీట మునిగింది.

జిల్లాలో 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో సగటున 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా నస్పూర్ మండలంలో 43.4 మిల్లీమీటర్లు, జైపూర్ 40.3, భీమిని 28.6, కాసిపేట 28.5, వేమనపల్లి 28.2, చెన్నూరు 28.1, కన్నెపల్లి 26.7, మందమర్రి 26.6, బెల్లంపల్లి 26.0, కోటపల్లి 25.6, జన్నారం 25.3, హాజీపూర్ 25.0, భీమారం 24.5, నెన్నెల 24.2, తాండూరు 23.8, లక్షెట్టిపేట 22.9, దండేపల్లి మండలంలో 22.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు, ఓబీ మట్టి తొలగింపు పనులు నిలిచిపోయాయి. క్వారీల్లో నీళ్లు నిలవడంతో పనులు ముందుకు జరగడం లేదు. భారీ వాహనాలు బురదలో కూరుకుపోయే అవకాశం ఉండటంతో ఒడ్డుపై నిలిపి ఉంచారు. మూడు ఏరియాల్లోని ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో దాదాపు రూ.32.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తితోపాటు, రూ.10 కోట్ల విలువైన ఓబీ మట్టి వెలికితీత పనులకు ఆటంకం కలుగుతోంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద....

ఎగువన తకురుస్తున్న భారీ వర్షాలకు హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీ వరద చేరుతోంది. ఎడతెరపిలేని వర్షాల కారణంగా ఎగువ నుంచి 24,433 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148 మీటర్లకు గాను ప్రస్తుతం 143.93 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 10.557 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ప్రాజెక్టు నుంచి హైద్రాబాద్‌లోని మెట్రోపాలిటన్ వాటర్ స్కీం కోసం 331 క్యూసెక్కుల నీటిని వదిలిపెడుతున్నారు.

నీట మునిగిన పత్తి పంటలు

కోటపల్లి: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది పొంగి పొర్లుతున్నది. నది ప్రవాహం పెరగడంతో సోమవారం బ్యాక్ వాటర్ పంట చేన్లలోకి ప్రవేశించింది. అన్నారం, జనగామ, సూపాక, ఆల్గామ, సిర్సా తదితర గ్రామాల్లోని పత్తి పంటలను నీట ముంచింది. వందల ఎకరాల్లో పంటలు నీట మునగగా తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు. వరద ఇలాగే కొనసాగితే లోతట్టు ప్రాంతాలను వరద నీరు ముంచే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. మరో వైపు జనగామ సమీపంలోని ఆరు గ్రామాలకు తాగునీరు అందించే మిషన్ భగీరథ పంప్‌హౌజ్ చుట్టూ నీరు చేరింది. పంప్‌హౌజ్‌కు సుమారు 2 మీటర్ల ఎత్తులో నీరు నిలిచి ఉంది. లిఫ్ట్ ఇరిగేషన్ సైతం వరద నీటిలోనే ఉంది. గోదావరి నది సైతం ఉధృతంగా ప్రవహిస్తుండగా రెండు నదులు కలిసి దేవులవాడ పరివాహక ప్రాంతం సముద్రాన్ని తలపిస్తోంది. గోదావరి నది ప్రవాహం తీవ్రంగా ఉండడంతో ప్రాణహిత నది ప్రవాహం ముందుకు వెళ్లలేక స్థానిక వాగుల్లోకి నీరు తిరిగి కమ్మడంతోనే పంటచేన్లన్నీ నీట మునిగినట్లు రైతులు పేర్కొన్నారు.

నీట మునిగిన పత్తి పంటలను ఏఈవోలు వైష్ణవి, అనూషలు క్షేత్రస్థాయిలో పరిశీలించారని వ్యవసాయాధికారి మహేందర్ తెలిపారు. వెంచపల్లి, సూపాక, జనగాం, పుల్లగాం, ఆల్గామ, సిర్సా గ్రామాల్లో క్షేత్ర పర్యటన చేసి నీట మునిగిన పత్తి పంటలపై ప్రాథమిక నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ప్రాథమికంగా 18 గ్రామాల్లో 864 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగినట్లు ఏవో పేర్కొన్నారు. జనగామ మాజీ సర్పంచు లక్ష్మణ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

వేమనపల్లి: ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ముల్కలపేట, వేమనపల్లి, సుంపుటం గ్రామాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. నీట మునిగిన పంటలను తహసీల్దార్ రమేష్, మాజీ ఎంపీటీసీ సంతోష్ కుమార్‌లు నాటు పడవల్లో వెళ్లి పరిశీలించి రైతులతో మాట్లాడారు. సుమారు 400 ఎకరాల్లో పంటలు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ధైర్యంగా ఉండాలని, పంటల నష్టం నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కమల్‌సింగ్, ఏఈవో రుక్సార్ సుల్తానా, మాజీ సర్పంచులు మధు, రాంచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ అలీ పాల్గొన్నారు.

నెన్నెల: మన్నెగూడం సమీపంలో ఎర్రవాగు ప్రవాహంలో ముంపునకు గురై ఇసుక మేటలు వేసిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. పంట నష్టం జరిగిన పత్తి చేలా విస్తీర్ణాన్ని కొలతలు వేసి లెక్కగట్టారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి రామగిరి శ్రీకాంత్ తెలిపారు. పంట నష్టం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఏఈవో రామ్‌చందర్ ఉన్నారు.

మున్సిపాలిటీలో కంట్రోల్ రూం

నస్పూర్: రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాల్లో నివాసం ఉండకూడదని సూచించారు. వరద నీరు చేరిన, శానిటేషన్, మంచినీరు విద్యుత్ ఇబ్బందులు ఉన్న వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కంట్రోల్ రూమ్ నంబర్లు చిట్యాల సతీష్ 9618801905, టి.శ్రీకాంత్ 9550665667, పిట్టల ప్రభాకర్, 99492 19646, డి.మధు 9959283814, ఆర్.సతీష్ 8074779049, రాంమూర్తి 9440811719లకు ఫోన్లు చేసి సమాచారం ఇవ్వవచ్చని కమిషనర్ సతీష్ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బోటులో వెళ్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

వేమనపల్లి, జూలై 22: మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ భాస్కర్ సూచించారు. మండలంలో కురిసిన వర్షాలకు ప్రాణహత నది ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాచర్ల-ముల్కలపేట గ్రామాల మధ్యలో గల వంతెన నీటిలో మునిగిపోవడంతో సోమవారం డీసీపీ వంతెన నీట మునిగిన ప్రాంతాన్ని బోటులో వెళ్లి పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతూ పోలీసులు అందుబాటులో ఉంటారని ధైర్యంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వర్షాల నేపథ్యంలో అత్యవసరం అయితేనే బయటకు రావాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులను చూడడానికి బయటకు వచ్చి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. ఏదైనా ఆపద ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. వరదల నుంచి బాధితులను రక్షించేందుకు రెస్క్యూటీంను ఏర్పాటు చేశామన్నారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఉన్నారు.

నాటు పడవలో వెళ్లి వైద్య శిబిరం



వేమనపల్లి, జూలై 22:వేమనపల్లి మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుంపుటం- వేమనపల్లి మధ్యలో ఉన్న లోలెవల్ కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. సోమవారం హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, వైద్య సిబ్బంది నాటు పడవలో వెళ్లి సుంపుటం పంచాయతీలోని జాజులపేట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు చేసి మందులు అందించారు. గర్భిణీలకు సూచనలు చేశారు.

ఊపందుకున్న వరి నాట్లు..



దండేపల్లి,జూలై 22: ఇటీవల కురిసిన వర్షాలతో బావులు, చెరువుల్లోకి నీరు చేరడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బోర్‌బావుల కింద, వ్యవసాయ బావుల కింద రైతన్నలు వరి నాట్లు వేస్తున్నారు. నాటు వేసేందుకు పొలాల్లో జంబు కొట్టిస్తున్నారు. కూలీలతో నాటు వేయించడం, నారు తీయడం, పొలం మడులు, ఒడ్డులు చెక్కించే పనుల్లో రైతులు, కూలీలు బిజీబిజీగా ఉన్నారు.

గోదావరి కళకళ..



దండేపల్లి, జూలై 22: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నదికి వరద పెరిగింది. కడెం ప్రాజెక్టు గేటు ఎత్తివేసి వరద నీటిని గోదావరిలోకి వదలడంతో కళకళలాడుతోంది. గోదావరి లోలెవల్ వంతెనకు సమాంతరంగా ప్రవహిస్తోంది.

పగుళ్లు తేలిన రహదారి



మందమర్రిటౌన్, జూలై 22: పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద జాతీయ రహదారి పగుళ్ల తేలిసింది. కురుస్తున్న భారీ వర్షాలకు నీరు నిలవడంతో రహదారి దెబ్బతిన్నది. సోమవారం పగుళ్ల తేలిన రోడ్డును మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మరమ్మతు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్డు మీదుగా పెద్ద పెద్ద వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్, జూలై 22: ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు గణితం సబ్జెక్టు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 50 శాతం మార్కులతో పీజీ గణితం, బీఈడీ చేసి ఉండాలన్నారు. నెలకు గరిష్ఠంగా రూ. 18,200 వేతనం ఉంటుందన్నారు. ఈనెల 25లోగా ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలి సూచించారు.

బస్సును పునరుద్ధరించాలి

మందమర్రిరూరల్, జూలై 22 : మంచిర్యాల నుంచి మందమర్రి మీదుగా ఆవడం వరకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని సోమవారం డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవపాలకు వెంకటాపూర్ గ్రామస్థుడు వెంకటేష్ వినతిపత్రం అందించారు. బస్సు నిలిపివేయడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రమేష్, రాజేష్, స్వామి, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్, జూలై 22: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు. ఎస్ఐ శ్రీధర్, కేజీబీవీ ఎస్‌వో ఫణిబాల పాల్గొన్నారు.

నేడు మార్కెట్ బంద్

బెల్లంపల్లి, జూలై 22: పట్టణంలోని కాంటా చౌరస్తాలో నిర్మించిన మార్కెట్ సముదాయంలో వ్యాపారులకు షాపులను కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం మార్కెట్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు కూరగాయల మార్కెట్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి రెండు సార్లు కలెక్టర్ మార్కెట్ సముదాయాన్ని సందర్శించి త్వరగా షాపులను అలాట్‌మెంట్ చేయాలని పేర్కొనడంతో మున్సిపల్ కమిషనర్ చర్చలు జరిపారన్నారు. అయినా షాపులు కేటాయించడం లేదన్నారు. వర్షాకాలం కావడంతో రోడ్లపై కూరగాయలు విక్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ క్యారమ్ పోటీలు

బెల్లంపల్లి, జూలై 22: నిజామాబాద్ జిల్లా భీంగల్‌లోని జేబీఎన్ గార్డెన్స్‌లో ఆగస్టు 2, 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజన్నలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్ పోటీలు ఉంటాయన్నారు. ఎంట్రీలను ఈనెల 30లోగా పంపాలని, వివరాలకు 9440010404లో సంప్రదించాలన్నారు.

పలువురు పోలీసులకు పదోన్నతి



పదోన్నతి పొందిన వారితో సీపీ

మంచిర్యాల అర్బన్, జూలై 22: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు పోలీసులు పదోన్నతి పొందారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ శ్రీనివాస్ పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. సీపీ మాట్లాడుతూ పదోన్నతితో బాధ్యత పెరుగుతుందని, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం, గౌరవాన్ని పెంచే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో 7గురు ఏఎస్సైలు ఎస్సైలుగా, 6గురు హెడ్ కానిస్టేబుల్స్ ఏఎస్సైలుగా, 16 మంది కానిస్టేబుల్స్ హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందారు. డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై డీసీపీకి ఫిర్యాదు



ఫిర్యాదును అందజేస్తున్న దివ్యాంగులు

మంచిర్యాల అర్బన్, జూలై 22: దివ్యాంగుల పట్ల వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు సోమవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉంటూ దివ్యాంగుల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరైం ది కాదని, వెంటనే ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద పల్లి సత్యనారాయణ, ఇందూరి రమేష్, రామ్ శ్రీనివాస్, ధరావత్ రాందాస్, దురిశెట్టి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలు లేకుండా చూడాలి



మున్సిపల్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళ మోర్చా నాయకులు

ఏసీసీ, జూలై 22: మంచిర్యాల పట్టణంలో వీధి కుక్కలు లేకుండా చూడాలని మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వాణి, తిరుమల, స్వప్న, లావణ్యలతో కలిసి ఆమె మాట్లాడారు. ఇటీవల హైద్రాబాద్‌లో వీధి కుక్కలు దాడి చేసి చిన్న పిల్లలను చంపడం ఆందోళన కలిగించిందన్నారు. మంచిర్యాల పట్టణంలో వీధీ కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని, పిల్లలను కరిచే ప్రమాదం ఉన్నందున వీధి కుక్కలను లేకుండా చూడాలన్నారు. పశువులు రోడ్లపై ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, రోడ్లపై ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.